# పాణి గ్రహణం

"ఆకాశమంత పందిరి భూదేవత అరుగు వేద్దామనుకున్నా, కాని టైం సరిపోలేదు. అబ్బాయికి సెలవులు లేవట! వచ్చేవారం అమెరికా వెళ్ళిపోవాలట!" రఘురామయ్య చెప్పాడు జానకిరామయ్యతో. అతను పెళ్ళికి వచ్చాడు బలవంతం మీద, బంధుత్వాలు వదులుకోలేక.

" పెళ్ళి బాగా జరిగింది. కాని మీ అల్లుడు ఫాస్టు ! పెళ్ళికాగానే అమ్మాయిని హనీమూన్‌కు తీసుకుపోయాడు." జానకిరామయ్య.

" మన ఛాదస్తాలు అతనికి నచ్చవు. సింపులుగా గుళ్ళో మెళ్లో తాళి కడతానన్నాడు. నేనే కాళ్ళా వేళ్ళా బడి అలా జరిగితే మా ఊళ్ళో నా పరువు పోతుందని హడావిడిగా యిలా కానించేశా! ఏలోటూ లేకుండా పెళ్ళి జరిగిందను కుంటున్నా బావా!" రఘురామయ్య అడిగాడు, సింహావలోకనం చేసుకుంటూ. ఆ పల్లెలో ఆ పెళ్ళి రంగరంగవైభవంగా జరిగింది.

" ఇంతకీ అమ్మాయి సీత ఈ పెళ్ళిని మనస్ఫూర్తిగా యిష్టపడిందా?" బాధను దిగమింగుకుంటూ అడిగాడు. ఎందుకంటే వాళ్ళబ్బాయి కోదండపాణిని సీతకు యివ్వాలని మనసు పడ్డాడు. చిన్నప్పటి నుండి ఊరిజనం అనుకున్న సంబంధం. కాని కోదండపాణి డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి పొలంకు అంకితం అయిపోయాడు. అది సీత తరపు వాళ్ళకు యిష్టం లేదు. అల్లుడు అంటే హూందాగా సూటు బూటు వేసుకుని కార్లల్లో తిరుగుతూ ఉండాలని వారి కోరిక. ఎందుకంటే రఘురామయ్య మంచి ఆస్థిపరుడు కూడ! చదువు పెద్దగా అబ్బలేదు- మట్టి పిసుక్కుంటూ ఉంటే అమ్మాయి సుఖపడదని అతని నమ్మకం.

" పాణి కూడ పెళ్ళికి వస్తే బాగుండేది!" వెంకమ్మ చెప్పింది.

" ఏమొహం పెట్టుకు వస్తాడు లే వదినా! మేమంటే సిగ్గులేనోళ్ళం కాబట్టి వచ్చాం! తనది అనుకున్న దాన్ని వేరేవాళ్ళు ఎగరేసుకు పోతూంటే ఎవడైనా ఎలా తట్టుకోగలడు." పార్వతమ్మ దెప్పి పొడిచింది. సీత డిగ్రీ పూర్తి చేసే సరికి కళ్ళు నెత్తిమీదకొచ్చాయి, అని ఆమె నిశ్చితాభిప్రాయం!

" ఏం చేస్తాం! పాణి కూడ పెద్ద ఆఫీసరయి ఉంటే బాగుండేది" వెంకమ్మ జవాబిచ్చింది, తన తప్పేమి లేదన్నట్లు.

" ష్ ! ఇప్పుడు కాని వాటిగురించి ఎందుకు ముందు భోజనాలకు లేవండి." రఘురామయ్య కలుగ చేసుకుని ఆ సంభాషణని అంతటితో ఆపించాడు.

హనీమూన్ పూర్తి చేసుకుని నవదంపతులు తిరిగి వచ్చారు. అల్లుడు శంకరం అమెరికాకు కూడ వెళ్ళిపోయాడు. తొందరలోనే అన్ని కాగితాలు పూర్తి చేసి, సీతను

అమెరికా తెప్పించుకుంటానని, దిగులు పడొద్దని చెప్పి వెళ్ళాడు.

కొన్ని రోజులు ఫోన్లు వచ్చాయి. తర్వాత ఆఫీసులో బిజీ అనీ చెప్పాడు- ఆ తర్వాత 'స్విచ్చాఫ్ ' అని వచ్చింది. నెలలు గడిచినా జవాబు లేదు.

శంకరం తల్లి దండ్రులను గూర్చి వాకబు చేస్తే హైద్రాబాద్‌లో వాళ్ళ మకాం మార్చేశారు. ఎవరిని అడిగినా ఎక్కడికి పోయింది తెలియదు. సెల్లు నంబర్లు మారిపోయినట్లున్నాయి.

తెలిసిన వాళ్ళని పట్టుకుని అమెరికాలో ఎంక్వయిరీ చేయిస్తే ఆ అడ్రసులో అటువంటి వ్యక్తి లేడని తెలిసింది.

శంకరం పైన పోలీసు కంప్లెయింటు యిచ్చి వాళ్ళ చుట్టూ - వీళ్ళ చుట్టూ తిరగడం రఘురామయ్య వంతయింది. డిప్రెషన్‌లోంచి బయట పడటానికి సీత స్కూలు టీచరుగా రాత్రింబగళ్ళు పిల్లలకు పాఠాలు చెబుతున్నది. ఎక్కువ సేపు పిల్లలతో గడుపుతున్నది.

సంవత్సరం గడిచింది.

శంకర్ మోసగాడని తేలింది. ఉద్యోగం పోయి అమెరికా వదిలి అతను అరబ్బు దేశాలకు ఎప్పుడో పారిపోయాడట! శంకర్ తల్లిదండ్రులు కూడ క్రిమినల్సు అని తేలింది. కట్నం భారీగా కొట్టేసి అందరూ వాటాలు పంచుకున్నారట! చట్టానికి చిక్కకుండా తిరుగుతున్నారు మకాములు మారుస్తూ. ఆరోజు పెళ్ళిరోజు. సీతకు పిచ్చెక్కిపోయింది. ఆవేదన తట్టుకోలేక మాత్రలు మింగింది. చుట్టపు చూపుగా వచ్చిన పార్వతమ్మ సీతను ఎగతాళి చేద్దామని ఆమె గదిలోకి వెళ్ళింది. మెలికలు తిరుగుతున్న సీతను చూసి కేకలు వేసింది.

అంతే ! అందరూ కలిసి హుటాహుటిన కార్లో ఆమెను పెద్దాసుపత్రికి తరలించారు. లక్కీగా డాక్టర్లు డ్యూటీలో ఉండబట్టి - సత్వర చికిత్స జరిగింది.

స్టమక్ వాష్ చేసి ప్రాణాపాయం నుండి తప్పించారు. ఐసియూలో చికిత్స చేయసాగారు. కాని హైద్రాబాద్‌కు తీసుకు పొమ్మని రికమెండ్ చేశారు.

మళ్ళీ అంబులెన్సులో గుండెలు చేత్తో పట్టుకుని హైద్రాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు పరుగెత్తారు.

వారం రోజులకు కొంచెం కోలుకుంది. ఇంకో వారం తర్వాత యింటికి తిరిగి వచ్చింది సీత.

వరండాలో ఎదురు చూస్తూ కోదండపాణి!

" సీతా ! ఎలా ఉంది?" బాధగా అడిగాడు, కోదండపాణి.

" నన్ను చూసి సంతోషిద్దామని వచ్చావా?" నీరసంగా అడిగింది.

" ఆఁ! నిజంగానే నిన్ను చూస్తూ ఉంటే ఆనందంగా ఉంది."

" హూ! జీవితంలో మోసపోయాననా ?" సీత చురుగ్గా అన్నది.

" కాదు - ప్రాణాలతో ఆరోగ్యంగా తిరిగివచ్చినందుకు - సీతా! ఇంకెప్పుడూ అటువంటి పిచ్చి పని చెయ్యమాకు! జీవితం చాలా అమూల్యమైంది 'దేవుడు బ్రతుకునిచ్చింది బ్రతకడానికి' ఎన్ని కష్టాలొచ్చినా ఎదురొడ్డి నిలబడ్డానికి." ధైర్యం చెప్పాడు.

" నీకేం భార్యాబిడ్డలతో జీవితాంతం సుఖంగా ఉంటావు! కాని నాకే భవిష్యత్తు అంటూ లేదే! జరిగిందానికి కుమిలిపోతూ ఒంటరిగా దుర్భరంగా బ్రతుకు బండి లాగించాలి!" ఏడ్చేసింది సీత.

కోదండపాణి చెలించిపోయాడు.

" ఎందుకలా అనుకోవాలి! మళ్ళీ పెళ్ళి చేసుకుని మొగుడు - పిల్లలతో సంతోషంగా ఉండు." చెప్పాడు పాణి.

ఉలిక్కిపడింది. రోషంతో అతని మొహంలోకి చూసింది. "మళ్ళీ పెళ్ళా! ఏం ఎగతాళిగా ఉందా? ఒకసారి మోసపోయిన దాన్ని ఏ మొగాడు పెళ్ళి చేసుకుంటాడు? చేసుకున్నా సరిగా ఏలుకోగలడా?"

నిరుత్తరుడయ్యాడు సీత ఆవేశానికి.

సాయంత్రం ఊరికి పోవడానికి సిద్ధమయ్యాడు.

" మామయ్య ! నేను వెళుతున్నా! సీతను జాగ్రత్తగా చూసుకోండి. వీలైతే ఆమెకు తోడుగా ఎవరినన్నా ఉంచండి. బాగా డిప్రెషన్‌లో ఉంది. పరిసరాలు మారితే బాగుంటుంది." కోదండపాణి చెప్పాడు.

" పొలం బాగా చేస్తున్నావా? పంటలు బాగా కాశాయా?"

" లేదు - పొలం మొత్తం కౌలుకిచ్చేశాను. టౌనులో వ్యాపారం చేస్తున్నాను- ఫర్వాలేదు బాగానే ఉంది."

" అదేంటి పొలం కౌలుకు యివ్వడమేంటి?" విస్తుపోయాడు.

" దానివలన జీవితంలో ఎంతో నష్టపోయాను- నాక్కావలసినదాన్ని పొందలేక పోయాను." బాధగా చెప్పాడు, కోదండపాణి.

" బాబు ! అన్ని మర్చిపోయి మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకో! నువ్వన్నా సుఖంగా ఉండు" దీవిస్తూ చెప్పాడు చెమర్చిన కళ్ళతో రఘురామయ్య.

" నిన్ను మా అమ్మాయికి చేసుకుంటే మాకీ సమస్యలుండేవి కావు- సీతకు ఈ

కష్టాలుండేవి కావు." ఏడుస్తూ చెప్పింది వెంకమ్మ.

" ఇప్పటికైనా - సీత నన్ను యిష్టపడితే, నాకు అభ్యంతరం లేదు." మనసులోని మాట బయట పెట్టాడు కోదండపాణి.

" బాబూ - ఇంత జరిగాక కూడ సీతను స్వీకరిస్తావా!" ఆశ్చర్యపోయాడు.

" అలా గనుక జరిగితే నువ్వు మా పాలిట దేవుడివి!" వెంకమ్మ.

తనగదిలోంచి ఈ సంభాషణ వింటున్న సీత రివ్వున దూసుకొచ్చి పాణికాళ్ళమీద పడిపోయింది. "బావా! నన్ను క్షమించు- నిన్ను కాదని ఎంత తప్పు చేశానో నా కిప్పుడు అర్థమయింది. కాని ఇప్పుడు నువ్వు -"

" సీతకు ఎప్పుడూ ఈ గుండెల్లో స్థానం ఉంటుంది!" అంటూ లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు పాణి!

- శాస్త్రీయం ఏప్రిల్ 2013

కథా నిలయం
శ్రీకాకుళం